ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 జయశంకర్ భూపాలపల్లి
ఆదివారం 20 జూలై 2025





నిర్మాణమవుతున్న కోచ్ ఫ్యాక్టరీ లోపలి భాగం





మీడియాతో మాట్లాడుతున్న రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్

మల్టిపుల్ ఫ్యాక్టరీతో కల సాకారం

- వచ్చే మార్చిలోగా మ్యానుఫ్యాక్చరింగ్ ప్రారంభం
- కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్
- రాష్ట్ర ప్రభుత్వం సూచన మేరకే స్థానికులకు ఉద్యోగాలు: కేంద్ర మంత్రి జీ.కిషన్‌రెడ్డి

కాజీపేటలో రూ.521 కోట్లతో ఫ్యాక్టరీ నిర్మాణం

వరంగల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాజీపేటలో నిర్మిస్తున్న మల్టిపుల్ రైల్వే యూనిట్‌తో ప్రజల దశాబ్దాల కల సాకారం అయిందని కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు. హనుమకొండ జిల్లా కాజీపేటలో నిర్మిస్తున్న రైల్వే మ్యానుఫాక్చరింగ్ యూనిట్‌ను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ అనేక ఏళ్లుగా తెలంగాణ ప్రజల కలగా ఉండేదని, ఆ కలను సాకారం చేసిన ఘనత ప్రధాని మోదీకి దక్కిందని అన్నారు. రూ.521కోట్లతో నిర్మిస్తున్న ఈ ఫ్యాక్టరీలో 2026నాటికి మ్యానుఫాక్చరింగ్ ప్రారంభమవుతుందన్నారు. ఈ యూనిట్ ఒక మెగా ఫ్యాక్టరీగా రూపుదిద్దుకుంటుందన్నారు. రైల్వే కోచ్‌లే కాకుండా ఇంజన్లు, మెట్రో రైళ్ల తయారీ, డిజైన్ పనులు కూడా జరుగుతాయని తెలిపారు. బహుళ రకాల రైల్వే ఉత్పత్తి (మిగతా 7వ పేజీలో)



కోచ్‌ఫ్యాక్టరీ నమూనాను పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి

పర్యటన సాగిందిలా..

కాజీపేట, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ పర్యటన శనివారం గంట ఆలస్యంగా ప్రారంభమైంది. షెడ్యూల్ ప్రకారం మధ్యాహ్నం 1.30 గంటలకు రావాల్సిన రైల్వే మంత్రి 2.28 గంటలకు చేరుకున్నారు. రైల్వేస్టేషన్‌లో పలువురిని కలిసి బొకేలు, వినతిపత్రాలు తీసుకున్న అనంతరం 3 గంటలకు కోచ్ ఫ్యాక్టరీలోకి ప్రవేశించారు. కోచ్‌ఫ్యాక్టరీ మోడల్ మ్యాప్‌ను పరిశీలించారు. కోచ్‌ఫ్యాక్టరీ నిర్మాణం, ఏర్పాటు చేసిన షెడ్‌లు, మిషనరీల ఏర్పాటు, ట్రాక్‌ల నిర్మాణం గురించి రైల్వే అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ చేశారు. అనంతరం మీడియా సమావేశంలో కేంద్ర మంత్రులు అశ్వినీ వైష్ణవ్, జి. కిషన్‌రెడ్డి మాట్లాడారు. అప్పటికే అయోధ్యపురం రైల్వే గేట్‌వద్దకు తీసుకువచ్చిన ప్రత్యేక రైలులో రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాత్సవ, డీఆర్ఎం భరతేశ్‌కుమార్ జైన్‌లు 3.48 గంటలకు రైలెక్కి వెళ్లారు. మొత్తంగా కోచ్‌ఫ్యాక్టరీలో 40 నిమిషాలు మాత్రమే రైల్వే మంత్రి పర్యటన సాగింది. సికింద్రాబాద్‌లో మరో కార్యక్రమానికి హాజరుకావల్సి ఉండడంతో మంత్రి పర్యటన హడావుడిగా సాగింది.

మేడారంలో గద్దెల రూపు మారదు..

- ఆలయ పరిసరాలను మాత్రం ఆధునికీకరిస్తాం
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క



హైదరాబాద్‌లోని సచివాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి సీతక్క

ములుగు, జూలై 19(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారం సమ్మక్క-సారలమ్మ వనదేవతల గద్దెల మార్పు లేకుండానే ఆలయ పరిసరాల ఆధునికీకరణ పనులు చేపడతామని రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క తెలిపారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో శనివారం ఆమె సమావేశం నిర్వహించారు. వనదేవతల ఆలయ ఆధునికీకరణ పనులపై అధికారులు, పూజారులు, నిపుణులతో సమీక్షించారు. పూజారుల కోరిక మేరకు భక్తుల సౌకర్యార్థం ఆలయ ప్రాంగణంలో ఆధునికీకరణ పనులు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.

ఆదివాసి, గిరిజన సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపడేలా సమ్మక్క-సారలమ్మ సన్నిధిని తీర్చిదిద్దుతామన్నారు. పూజారుల విశ్రాంతి గదులు, అత్యవసర సేవలు, భద్రత, వైద్య సిబ్బంది, మీడియా కోసం అదనపు వసతులు కల్పిస్తామన్నారు. సమావేశంలో దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, కమిషనర్ వెంకట్రావు, ములుగు కలెక్టర్ దివాకర, ఏటూరునాగారం ఐటీడీఏ పీవో చిత్రమిశ్రా, మేడారం ఆలయ పూజారులు, గిరిజన సాంస్కృతిక శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వన మహోత్సవాన్ని సక్సెస్ చేయాలి

డీఆర్డీవో బాలకృష్ణ



మొక్కను నాటుతున్న డీఆర్డీవో బాలకృష్ణ

కాటారం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): వన మహోత్సవ కార్యక్రమాన్ని పండగలా జరుపుకొని విజయవంతం చేయాలని గ్రామీణాభివృద్ధి శాఖ జిల్లా అధికారి (డీఆర్డీవో) బాలకృష్ణ అన్నారు. వనమహోత్సవంలో భాగంగా మండలంలోని గుండ్రాత్‌పల్లి, దామెరకుంట, విలాసాగర్ గ్రామపంచాయతీల పరిధిలో శనివారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఉపాధిహామీ పథకంలో భాగంగా విరివిగా మొక్కలు నాటే కార్యక్రమాలను కూలీల సాయంతో చేపట్టాలన్నారు. ప్రతి జీపీ పరిధిలోనూ మొక్కలు నాటాలని, అటవీ ప్రాంతంలో హరిత వనాలు ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో వెంకన్న, ప్లాంటేషన్ సూపర్‌వైజర్ శ్రీకాంత్, టెక్నికల్ అసిస్టెంట్లు శ్రీనివాస్, మనోజ్, రవళి, పంచాయతీ కార్యదర్శులు సాయికృష్ణ, గంగాధరన్, ఫీల్డ్ అసిస్టెంట్లు తిరుపతి, వినోద్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

‘మేడిగడ్డ’కు కొనసాగుతున్న వరద

మహదేవపూర్ రూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. శనివారం బ్యారేజీలోకి 90,340 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 85గేట్లను ఎత్తి, అంతే నీరు దిగువకు పంపిస్తున్నారు. బ్యారేజీ వద్ద గోదావరి నది రెండు మీటర్ల ఎత్తులో ప్రవహిస్తోంది.

‘దేవాదుల’లో మరో మోటారు ఆన్

కన్నాయిగూడెం (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని గుట్టల గంగారం వద్ద ఉన్న జె.చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టులోని ఫేజ్-3లో శనివారం ఉదయం మరో మోటారును ఆన్ చేశారు. ఇప్పటికే ఫేజ్-2 రెండు మోటార్లు, ఫేజ్-3లో రెండు మోటార్లు ద్వారా 1,078 క్యూసెక్కుల నీటిని పంపింగ్ చేస్తున్నారు. శనివారం ఉదయానికి ఫేజ్-3లో మరో మోటారును ఆన్ చేసి మొత్తం ఐదు మోటార్ల ద్వారా 1,370 క్యూసెక్కుల నీటిని భీంఘన పూర్ రిజర్వాయర్‌కు ఎత్తి పోస్తు న్నారు. దేవాదుల ఇన్‌టేక్‌వెల్ వ ద్ద 71.00 మీటర్ల నీటిమట్టం న మోదైనట్టు నీటిపారుదల శాఖ డీఈఈ శరత్ బాబు తెలిపారు.

హత్యాయత్నం కేసులో అరెస్టు

కాటారం, జూలై 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దులపల్లి వద్ద భూ తగాదాలో గత నెల 30న సొంత తమ్ముడిపై గొడ్డలితో దాడి చేసి హత్యాయత్నం చేసిన కొత్తపల్లి గ్రామపంచాయతీ పరిధి సుందర్రాజ్‌పేట గ్రామానికి చెందిన తోటపల్లి వెంకట్‌రెడ్డిని అరెస్టు చేసినట్టు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. గొడ్డలితో దాడిచేయడంతో దేవేందర్ తలకు తీవ్ర గాయమైందని, నిందుతుడు వెంకట్‌రెడ్డి పరారీలో ఉండగా శనివారం అతడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించామని వివరించారు.

బీసీలను ఆదరించని రేవంత్ సర్కార్

బీజేపీ నేతలు సత్యనారాయణ, కీర్తిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న గల్ల సత్యనారాయణ

చిట్యాల, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : రేవంత్ పాలనలో బీసీలకు ఆదరణ కరువైందని బీజేపీ రాష్ట్ర నాయకుడు, జిల్లా ప్రభారి గల్ల సత్యనారాయణ, రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డి విమర్శించారు. మండలంలోని జూకల్లు శివారు ఫంక్షన్ హాల్‌లో పార్టీ జిల్లా అధ్యక్షుడు నిశీధర్‌రెడ్డి అధ్యక్షతన శనివారం జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా కార్యకర్తలు కష్టపడాలన్నారు. వార్డు మెంబర్ మొదలుకొని జడ్పీ చైర్మన్ వరకు పార్టీ అభ్యర్థులు గెలుపొందే విధంగా సమన్వయంతో పని చేయాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నెరవేర్చలేదని, రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యాలను ప్రజలకు వివరించాలని సూచించారు. కాంగ్రెస్ సర్కారుకు బీసీలపై ప్రేమ లేదని, మాటలతో మభ్యపెడుతోందని విమర్శించారు. ఈసమావేశంలో బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యుడు నాగపూరి రాజమౌళి, రాష్ట్ర నాయకులు వెన్నంపల్లి పాపన్న, రాంచంద్రారెడ్డి, ప్రసాద్‌రావు, మొగిళి, భట్టు రవి, జిల్లా ప్రధాన కార్యదర్శి గణపతి, రవీందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

‘డబుల్ బెడ్‌రూం’ లబ్ధిదారుల నిరసన

డీటీసీగా సురేశ్‌రెడ్డి

6వ పేజీలో..

కాంగ్రెస్ పాలనలోనే పేదలకు ‘ఆహార భద్రత’

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



చిట్యాలలో రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

చిట్యాల, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పాలనలోనే పేదలకు ఊరట కలుగుతోందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. బీఆర్ఎస్ పాలనలో ఆహార భద్రత కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నా ఎదురుచూపులే మిగిలాయన్నారు. మండల వ్యాప్తంగా 704 కుటుంబాలకు కొత్త రేషన్‌కార్డులను మండల కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే శనివారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కొత్త కార్డుల లబ్ధిదారులకు సైతం సన్న బియ్యం పంపిణీ చేస్తామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని కొనియాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పోటీ చేసే అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ ప్రకాశ్‌రెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ గుమ్మడి శ్రీదేవి, తహసీల్దార్ ఇమామ్ షేక్ బాబా, పార్టీ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి మధువంశీకృష్ణ, అధికార ప్రతినిధి దొడ్డి కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు

టేకుమట్ల (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ రేషన్ కార్డులు అందిస్తామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారయణరావు అన్నారు. మండల కేంద్రంలో తహసీల్దార్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 61 మంది లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులు అందజేశారు. రేషన్ కార్డుల నిరంతర ప్రక్రియన్నారు. లిస్టులు పేరు రాని వారు ఆందోళన చెందొద్దన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఐతా ప్రకాశ్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పదేళ్ల తర్వాత పంపిణీ చేసిన ఘనత కాంగ్రెదే..

రేగొండ, (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ హయాంలో అర్హులైన వారికి సైతం రేషన్‌కార్డులు అందలేదని, పదేళ్ల తర్వాత అందజేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. రేగొండ, కొత్తపల్లిగోరి మండల కేంద్రాల్లో రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుతోపాటు కలెక్టర్ రాహుల్ శర్మ హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా పాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్‌కార్డులు ఇస్తున్నామని తెలిపారు. 21న కొత్తపల్లిగోరి మండలంలో పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయడానికి మంత్రులు వస్తున్నారని తెలిపారు. నూతన మండలంలో ఇప్పటికే తహసీల్దార్ కార్యాలయం, మండల ప్రజా పరిషత్ కార్యాలయం నిర్మాణం ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, తహసీల్దార్ శ్వేత, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, డీఎస్పీ సంపత్‌రావు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు సంపత్‌రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ కిష్టయ్య, పీఏసీఎస్ చైర్మన్ విజ్ఞన్‌రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సయ్య, సీనియర్ నాయకులు ఓంప్రకాశ్, ఉమేష్‌గౌడ్, వీరబ్రహ్మం, మటిక సంతోష్, ముడతనపల్లి శంకరయ్య, వావిలాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ఏటూరునాగారంలోని ఐటీడీఏ కార్యాలయం

పట్టుతప్పిన శిక్షణ

- గిరిజన నిరుద్యోగులకు వృత్తి, నైపుణ్య తర్ఫీదు కరువు
- మూలనపడ్డ యూత్ ట్రైనింగ్ సెంటర్లు
- బడ్జెట్ కేటాయింపులో అధికారుల నిర్లక్ష్యం
- జాబ్‌మేళాల పరిస్థితి అంతంతమాత్రమే
- అవస్థలు పడుతున్న గిరిపుత్రులు



ఏటూరునాగారం రూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏలు గిరిజన నిరుద్యోగులకు ఆపన్న హస్తాన్ని అందించాలి. ఉన్నత చదువులు చదివి ఉద్యోగావకాశాలు లేని గిరిజన నిరుద్యోగ యువతకు ఐటీడీఏలు ఓ దారిని చూపాలి. వృత్తి, నైపుణ్యంతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో కొలువులు సాధించడంలో ఉచిత శిక్షణనిచ్చి ఉజ్వల భవితను అందించాల్సి ఉంది. అయితే.. ఐటీడీఏలు ఆ దిశగా కృషి చేయడం లేదనే విమర్శలు వస్తున్నాయి. గత కొన్ని నెలలుగా ఐటీడీఏ ద్వారా నిరుద్యోగ యువతకు ఎలాంటి శిక్షణ తరగతులు నిర్వహించకపోవడం వారి పాలిట శాపంగా మారింది. ఆర్థిక స్తోమత అంతంతమాత్రంగానే ఉండి ప్రైవేట్ సంస్థలో శిక్షణ తీసుకోలేక ఏం చేయాలో తెలియక చదువుకున్న యువత మనోవేదనను అనుభవిస్తున్నారు. గతంలో గిరిజన నిరుద్యోగ యువత కోసం ఐటీడీఏ ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగాలు పొందేందుకు ఉచిత వసతి సౌకర్యంతో పాటు శిక్షణ అందేది. కానీ, సుమారు 9 నెలలుగా శిక్షణ పట్టు తప్పింది. దీనికి బడ్జెట్ లేమి, దానిపై ఐటీడీఏ దృష్టి పెట్టకపోవడం కారణాలు అని తెలుస్తోంది.

మూలనపడ్డ యూత్ ట్రైనింగ్ సెంటర్లు

గిరిజన నిరుద్యోగ యువతకు ఆయా రంగాల్లో ఉచిత శిక్షణనిచ్చే లక్ష్యంతో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా నాలుగు యూత్ ట్రైనింగ్ సెంటర్లను ఏర్పాటు చేశారు. వరంగల్ జిల్లా కేంద్రంతోపాటు భూపాలపల్లి జిల్లా కాటారంలో, ములుగు జిల్లా జాకారంలో, ఏటూరునాగారంలో మొత్తం నాలుగు వైటీసీ కేంద్రాలు ఉన్నాయి. ఇవి ఐటీడీఏ పర్యవేక్షణలో గిరిజన నిరుద్యోగ యువతకు వృత్తి, నైపుణ్యంతో పాటు ప్రైవేట్, ప్రభుత్వ ఉద్యోగాలు, స్వయం ఉపాధి కల్పనకు శిక్షణ ఇవ్వాల్సి ఉంది. ప్రస్తుతం ములుగు జిల్లా జాకారంలోని వైటీసీలో సెంట్రల్ యూనివర్సీకి వాడుతుండగా ఏటూరునాగారం, కాటారం లోని వైటీసీ గత కొన్ని నెలలుగా ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం ఒక్క వరంగల్ వైటీసీలోనే నామమాత్రంగా డీడీయూ-జీకేవై స్కిల్ డెవలప్‌మెంట్‌కు సంబంధించిన (మిగతా 8వ పేజీలో)



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ సీతారాంనాయక్

స్థానిక ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించాలి

మహబూబాబాద్ మాజీ ఎంపీ సీతారాంనాయక్

ములుగు కలెక్టరేట్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ తరపున పోటీ చేసే అభ్యర్థులు విజయం సాధించేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా ఎన్నికల ప్రభారి, మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్ కోరారు. ములుగులోని పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం అధ్యక్షతన శనివారం జరిగిన సమావేశంలో సీతారాం నాయక్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు కార్యకర్తలు వివరించాలన్నారు. ప్రజా సమస్యలపై పోరాడాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఎన్నికల కన్వీనర్ భూక్య రాజునాయక్, ఎస్టీ మోర్చా అధికార ప్రతినిధి గుగులోత్ స్వరూప, నాయకులు శీలమంతుల రవీంద్రాచారి, భర్తపురం నరేష్, జినుకల కృష్ణాకర్‌రావు, మల్లెల రాంబాబు, కొత్త సుధాకర్‌రెడ్డి, లింగంపల్లి శ్రీనివాస్, రవిరెడ్డి, సూర్యదేవర విశ్వనాథ్, కారుపోతుల యాదగిరి, పల్లా బుచ్చయ్య, అల్లె శోభన్, లవన్‌కుమార్, సునీల్‌కుమార్, శ్యాంప్రసాద్, రాయంచు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యా సంస్థల బంద్‌ను విజయవంతం చేయాలి

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్

కృష్ణకాలనీ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఈనెల 23న వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో తలపెట్టిన విద్యా సంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోత్కు ప్రవీణ్‌కుమార్ కోరారు. భూపాలపల్లిలోని కొమురయ్య భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని విద్యార్థి సంఘాలు బంద్‌కు పిలుపునిచ్చాయని తెలిపారు. పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రియింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు కావస్తున్నా ఇంకా విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం దారుణమన్నారు. ఈ సమావేశంలో నాయకులు నేరేళ్ల జోసెఫ్, బొడ్డు స్మరణ్, పొంగంటిరాకేష్, వికాస్, ఆత్కూరి తిరుపతి, ముద్దమల్ల విష్ణువర్ధన్, నరేష్‌చారి తదితరులు పాల్గొన్నారు.

మంత్రుల పర్యటనకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

పలు అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే జీఎస్ఆర్

భూపాలపల్లిటౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి నియోజవర్గ పరిధిలో పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఈనెల 21న రానున్నారని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తెలిపారు. ఇందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. కలెక్టర్ రాహుల్‌శర్మతో కలిసి ఆయన ఆయా పనులను, భవనాలను శనివారం పరిశీలించారు. భూపాలపల్లి నియోజకవర్గంలోని గోరికొత్తపల్లిలో నూతన పోలీస్‌స్టేషన్ ప్రారంభం, గణపురంలో నూతన సర్కిల్ కార్యాలయం, చెల్పూరులో నూతన బస్టాండ్ ప్రారంభోత్సవం మంత్రుల చేతుల మీదుగా జరగనున్నాయని అన్నారు. భూపాలపల్లిలో డబుల్ బెడ్‌రూం ఇళ్లకు పట్టాల పంపిణీ చేయనున్నారని, జిల్లా గ్రంథాలయ భవనాన్ని ప్రారంభించనున్నారని తెలిపారు. భూపాలపల్లి పట్టణంలోని పాత ఎస్పీ కార్యాలయంలో స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభించుటకు ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. వీరి వెంట అదనపు కలెక్టర్లు విజయలక్ష్మి, అశోక్‌కుమార్, పీఆర్వో వెంకటేశ్వర్లు, మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.



డబుల్ బెడ్‌రూం ఇళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, కలెక్టర్ రాహుల్‌శర్మ

బంగారం చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్



పోలీస్‌స్టేషన్‌లో నిందితుల అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ తిరుపతిరావు

- భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి
- వివరాలను వెల్లడించిన డీఎస్పీ తిరుపతిరావు

కేసముద్రం, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం మండలం కల్వల శివారులో బొడ్డు వెంకటమ్మ మెడలోంచి బంగారు గొలుసు చోరీ చేసిన కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు వెల్లడించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం నిందితుల అరెస్ట్, సొత్తు రికవరీని చూపారు. డీఎస్పీ తెలిపిన ప్రకారం...కల్వలకు చెందిన బొడ్డు వెంకటమ్మ శుక్రవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో తన చేను వద్ద రోడ్డు పక్కన పనిచేసుకుంటోంది. నెల్లికుదురు మండలం తారాసింగ్‌బావికి చెందిన మౌర్య హేమంత్, మానుకోట పట్టణం చేపల మార్కెట్ పాతబజార్‌కు చెందిన రున్వాల్ వినోద్‌లు నీలిరంగు స్కూటీపై వచ్చి వెంకటమ్మ మెడలోంచి రెండు తులాల బంగారు గొట్టాల గొలుసును తెంపుకొని పారిపోయారు. అదే ప్రాంతంలో సీసీ కెమెరా ఉండడంతో నిందితుల కోసం ఐదు బృందాలుగా విడిపోయి మహబూబాబాద్, గూడూరు, నెల్లికుదురుకు వెళ్లే మార్గాల్లో నిఘా పెట్టారు. శనివారం మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో కోరుకొండపల్లి క్రాస్ రోడ్డు వద్ద బ్లూకలర్ స్కూటీపై వస్తున్న నిందితులను పట్టుకున్నారు. వీరి నుంచి బంగారు గొలుసుతోపాటు స్కూటీ, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఒక్క సీసీ కెమెరా వందమందితో సమానమని, ప్రతీ ఒక్కరు తమ భద్రత కోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ సూచించినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ కేసును త్వరితగతిన ఛేదించినందుకు డీఎస్పీతోపాటు రూరల్ సీఐ సర్వయ్య, సీసీఎస్ సీఐ హతిరాం, కేసముద్రం, నెల్లికుదురు ఎస్ఐలు జి.మురళీధర్‌రాజ్, సీహెచ్.రమేష్‌బాబు, సీసీఐ ఎస్ఐ తాహెర్‌బాబ, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి

- నక్సలైట్లతో శాంతి చర్చలు జరపాలి
- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

కొత్తగూడ, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : ఆపరేషన్ కగారును నిలిపివేయాలని, నక్సలైట్లతో శాంతి చర్చలు జరపాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం కోరారు. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం ఎంచగూడెంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ దేశ పౌరులను ఈ దేశ ప్రభుత్వమే ఆపరేషన్ కగార్ పేరుతో చంపివేయడం దుర్మార్గమైన పరిస్థితి అని పేర్కొన్నారు. ఏ దేశంలో ఇలాంటి చర్యలు చేపట్టలేదని తెలిపారు. పౌరులు తమకు నచ్చిన రాజకీయాన్ని, తమకు నచ్చిన భావాలను చెప్పుకునే స్వేచ్ఛ, హక్కు ఉందని పేర్కొన్నారు. ఈ ఆపరేషన్ కగార్‌పై సుప్రీం కోర్ట్ సైతం వాఖ్యలు చేసిన సందర్భాలు ఉన్నాయని వివరించారు. ఇప్పటికైనా కేంద్ర సర్కార్ స్పందించి ఆపరేషన్ కగారును నిలిపివేసేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌లో..

- మరో 8 రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం కల్పించాలి
- రైల్వే మంత్రికి బీజేపీ నేతల వినతి

మహబూబాబాద్ రూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌లో మరో 8 కొత్త రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం కల్పించాలని కేంద్ర రైల్వే మంత్రి అశ్విన్‌వైష్ణవ్‌ను బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు కోరారు. వరంగల్‌కు వచ్చిన రైల్వేమంత్రి అశ్విన్‌వైష్ణవ్‌ను శనివారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం మహబూబాబాద్ జిల్లాకు రైల్వే వర్క్‌షాప్‌ను మంజూరు చేయడంతో పాటు వాటి పనుల కోసం రూ.908 కోట్లు మంజూరు చేస్తూ ఉత్వర్వులు జారీ చేయడం అభినందనీయమన్నారు. మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌లో 4వ ప్లాట్‌ఫాం నిర్మాణం చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రైల్వే మంత్రిని కలిసిన వారిలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వద్దిరాజు రాంచందర్ రావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు క్యాచువల్ శ్యాంసుందర్‌శర్మ, పొదిళ్ల నర్సింహరెడ్డి, గాదె రాంబాబు, చీకటి మహేష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

అధ్యాపకుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

ఏటూరునాగారం రూరల్, జూలై19 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధి గిరిజన సంక్షేమ గురుకులు, ఆశ్రమ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న ఇంటర్ విద్యార్థులకు జేఈఈ, నీట్, ఎంసెట్‌లో శిక్షణ ఇచ్చేందుకు అధ్యాపకుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు పీవో చిత్రామిశ్రా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గణితం, భౌతిక, రసాయన, వృక్ష, జంతు శాస్త్రంలో అనుభవం కలిగిన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. 50శాతం మార్కులతో సంబంధిత సబ్జెక్టులతో గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి ఉండాలని తెలిపారు. కనీసం ఐదేళ్లపాటు జేఈఈ, నీట్, ఎంసెట్ కోర్సుల్లో శిక్షణనిచ్చిన అనుభవం ఉండాలని, హనుమకొండలో శిక్షణ ఇచ్చేందుకు ఆసక్తి ఉండాలని సూచించారు. అర్హతలు కలిగిన ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 22లోగా హనుమకొండలోని బాలసముద్రంలో ఉన్న టీడబ్ల్యూ స్టడీ సర్కిల్‌లో దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు. వివరాలకు 7675978439, 8328546015 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

మేడారం దేవస్థానం వద్ద వెలగని లైట్లు

తాడ్వాయి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం వనదేవతలు సమ్మక్క-సారలమ్మల దేవస్థానం ఎదుట రాత్రిళ్లు విద్యుత్ లైట్లు కొన్ని రోజులుగా వెలగడం లేదని భక్తులు, స్థానిక పూజారులు తెలిపారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు అమ్మవార్ల చెంత నిద్ర చేస్తుంటారని, చీకటి ఉండటం వల్ల వారు రాత్రిళ్లు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ఫిర్యాదు చేద్దామంటే అధికారులు దేవస్థానం పరిధిలో అందుబాటులో ఉండటం లేదని తెలిపారు. అంతేకాకుండా వనదేవతల ప్రాంగణంలో తాగునీరు, మరుగుదొడ్ల సమస్యలు కూడా భక్తులు తెలిపారు.



మేడారం దేవస్థానం ఎదుట వెలుగని విద్యుత్ లైట్లు

ఇనుపరాతి గట్లను సందర్శించిన సంరక్షణ అధికారి

ధర్మసాగర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లాలోని ఏకైక ఫారెస్టు అయిన ధర్మసాగర్ మండలం దేవునూర్ ఇనుపరాతి గట్లను తెలంగాణ రాష్ట్ర అటవీ ముఖ్య సంరక్షణ అధికారి డాక్టర్ సువర్ణ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఇనుపరాతి గట్లలోని కొంత దూరం నడుచుకుంటూ వెళ్లి ఫారెస్టు ప్రాంతాన్ని ఆమె పరిశీలించారు. గుట్టలకు సంబంధించిన రికార్డులను స్వయంగా ఆమె పరిశీలించారు. ఫారెస్టుకు సంబంధించిన పూర్తి వివరాల గురించి అడవికి సంబంధించిన గ్రోతింగ్ ఎలా ఉందని డీఎఫ్‌వో భిక్షపతిని అడిగి తెలుసుకున్నారు. కాగా హనుమకొండ జూపార్కు అనుకూలంగా ఉంటుందా లేదని, ఫారెస్టు భూమిని అక్రమణకు గురికాకుండా కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి చర్చించినట్లు తెలిసింది. కార్యక్రమంలో ఫారెస్టు అధికారులు భీమనాయక్, అనుజ అగర్వాల్, కృష్ణామచారి భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

సెర్ప్ సిబ్బందితో నాయకుల వాగ్వాదం

గీసుగొండ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): తాము చెప్పిన వ్యక్తిని ఎందుకు విలేజ్ ఆర్గనైజింగ్ అసిస్టెంట్(వీవోఏ)గా నియమించటం లేదని సెర్ప్ ఏపీఎం సురేష్, సిబ్బందితో స్థానిక కాంగ్రెస్ నాయకులు మండల సమాఖ్య కార్యాలయంలోనే వాగ్వాదానికి దిగటం చర్చనీయాంశంగా మారింది. శనివారం మండల సమాఖ్య కార్యాలయంలోకి చొచ్చుకువెళ్లిన నాయకులు ఏపీఎంను చుట్టుముట్టి చంద్రయపల్లి వీవోఏగా తాము చెప్పిన శివకుమార్‌ను ఎందుకు నియమించడం లేదని గొడువపడ్డారు. ఈ విషయమై ఏపీఎంను వివరణ అడుగగా.. గతంలో చంద్రయపల్లిలో వీవోఏగా పనిచేసిన రవీందర్ అవినీతికి పాల్పడడంతో స్థానిక పొదుపు సంఘం మహిళలు అతడిని విధుల నుంచి తొలగించినట్లు చెప్పారు. అయితే అతని స్థానంలో స్థానికంగా ఉండే శివకుమార్‌ను నియమించాలని సదరు కాంగ్రెస్ నేతలు గత కొన్ని రోజులుగా పట్టుబడుతున్నారన్నారు. కొత్త నిబంధనల ప్రకారం మహిళను వీవోఏగా నియమించాల్సి ఉందని ఆయన తెలిపారు. నిబంధనల ప్రకారమే పై అధికారుల ఆదేశానుసారంగా నియామకం జరుగుతుందని వివరించారు.

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

భద్రాచలం ఎమ్మెల్యే వెంకట్రావ్

వెంకటాపురం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ అన్నారు. శనివారం ఆయన మండలంలో పర్యటించారు. మండల కేంద్రంలోని మార్కెట్‌యార్డు ఆవరణలో లబ్ధిదారులకు రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు అనేక పథకాలను ప్రవేశపెట్టిందని అన్నారు. మహిళా సంఘాలకు బస్సులు ఇచ్చిందని, వడ్డీలేని రుణాలు అందజేస్తోందన్నారు. రేషన్‌షాపుల్లో లబ్దిదారులకు సన్నబియ్యం ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ములుగు అదనపు కలెక్టర్ సి.హెచ్.మహేందర్‌జీ, సివిల్ సప్లయ్ జిల్లా అధికారి ఫైజల్, డీఎం రాంపతి, తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో రాజేంద్ర ప్రసాద్, పీఏసీఎస్ అధ్యక్షుడు చిడెం మోహన్‌రావు, నాయకులు మన్నెం సునీల్, చిట్టెం సాయికృష్ణ, శివ, సయ్యద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ రేషన్‌కార్డులు

వాజేడు (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ రేషన్‌కార్డును ఇవ్వటమే ప్రభుత్వం ధ్యేయమని భద్రాచలం ఎమ్మెల్యే వెంకట్రావ్ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద ఏర్పాటు చేసిన నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండలంలో నూతనంగా 944 మందికి రేషన్ కార్డులు మంజూరు కాగా వాటిని ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ప్రభుత్వంలో పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. అడిషనల్ కలెక్టర్ మహేందర్‌జీ మాట్లాడుతూ రేషన్‌కార్డుల జారీ అనేది నిరంతర ప్రక్రియన్నారు. ప్రస్తుతం కార్డులు రాని వాళ్లు మీసేవా కేంద్రాల్లో మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ముందు రైతు వేదిక వద్ద అటవీ శాఖ ఆధ్వర్యంలో వనమహోత్సవం కార్యక్రమం జరిగింది. వెంకటాపురం ఎఫ్‌డీవో ద్వాలియా ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మొక్కలు నాటారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ అంజయ్య, సివిల్ సప్లయ్ జిల్లా అధికారి సయ్యద్ హుస్సేన్, ఎఫ్ఆర్‌వో చంద్రమౌళి, ఎఫ్ఎస్‌వో నాగమణి, ఎంపీడీవో శ్రీకాంత్ నాయుడు, ఆర్ఐ కుమార స్వామి, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి విక్రాంత్ వర్మ, నాయకులు కల్యాణ్‌వర్మ, కాళీకృష్ణ, తల్లడి ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.



వాజేడులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకట్రావ్

రోడ్డుపై అంగడితో ఇబ్బందులు

● ఖాళీగా ఉన్న ఆర్‌వోబీ సర్వీస్ రోడ్లు

కేసముద్రం, జూలై 19 (ఆంధ్రజ్యోతి) :కేసముద్రంలో ప్రతి గురువారం నిర్వహించే అంగడి తొర్రూరు, వరంగల్ ప్రాంతాలకు వెళ్లే రహదారి వెంట నిర్వహిస్తుండడంతో వాహనదారులకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కేసముద్రం మునిసిపాలిటీ పరిధిలోని ఈ అంగడిని మార్కెట్‌రోడ్డులో నిర్వహించేవారు. మార్కెట్‌కు సరుకుల వాహనాల రాకపోకలతోపాటు ఇతర వాహనాలతో ఇబ్బందులు ఉండడంతో దీన్ని ఆర్‌వోబీ రోడ్డుకు మార్చారు. కేసముద్రం మీదుగా అటు మహబూబాబాద్ ఇటు వరంగల్, తొర్రూరు ప్రాంతాలకు వెళ్లే రహదారి కావడంతో ఆర్‌వోబీ రోడ్డులో అంగడి కారణంగా వాహనాల రాకపోకలకు ఆటంకం ఏర్పడుతోంది. రోడ్డుకిరువైపులా అంగడిలోని చిరువ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేసుకోవడంతో ఆ దుకాణాల్లో కొనుగోలు చేసే వారు, వారి వెంట ఉన్న ద్విచక్ర వాహనాలు రోడ్డుపైనే ఉంటున్నాయి. దీంతో ఈ మార్గంలో మహబూబాబాద్, తొర్రూరు, వరంగల్ ప్రాంతాలకు వెళ్లే వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. ఆర్‌వోబీకి ఇరువైపులా సర్వీస్‌రోడ్డు ఖాళీగా ఉంటున్నాయి. ఆ ప్రాంతంలో అంగడిని నిర్వహిస్తే ట్రాఫిక్ ఇబ్బందులు తొలగిపోతాయని పలువురు సూచిస్తున్నారు. ఈ దిశలో మునిసిపల్ అధికారులు స్పందించి చర్యలు తీసుకుని అంగడిలో రోడ్డుకిరువైపులా ఉండే దుకాణాలను ఆర్‌వోబీ సర్వీస్‌రోడ్లపై ఏర్పాటు చేయించాలని పలువురు కోరుతున్నారు.



కేసముద్రం ఆర్‌వోబీ రోడ్డులో మహబూబాబాద్-వరంగల్ రహదారిపై నిర్వహిస్తున్న అంగడి

వరంగల్ మార్కెట్ ధరలు (రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు	2432	1521
పల్లికాయ (సూక)	5600	3450
పల్లికాయ (పచ్చిది)	4200	1575
కందులు	5922	3022
పెసళ్లు	8001	3022
పత్తి	7720	5300
పసుపు (కాడి)	11509	9534
పసుపు (గోల)	10250	9700
తేజ మిర్చి	11000	8500
తేజ ఏసీ	13500	11500
వండర్‌హాట్	10000	6000
వండర్‌హాట్ ఏసీ	14000	11500
యూఎస్341ఏసీ	13000	7000
దీపిక	9000	8000
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

ఉపాధ్యాయుడా.. సలామ్!

» బడి బాగు కోసం రూ.4లక్షలు ఖర్చు చేసిన హెచ్‌ఎం
» పాఠశాల గోడలపై బొమ్మలు.. సీసీ కెమెరాల ఏర్పాటు
» ఆదర్శంగా నిలుస్తున్న హెచ్‌ఎం శ్రీనివాస్
» పాలకుర్తిలో కార్పొరేట్‌ను తలపిస్తున్న సర్కారు బడి


విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న హెచ్‌ఎం శ్రీనివాస్



పాఠశాలలో విద్యార్థుల కోసం నిర్మించిన మరుగుదొడ్లు

పాలకుర్తి, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : ఆ ఉపాధ్యాయుడి సంకల్పం బడి ముఖ చిత్రాన్నే మార్చేసింది. కళా విహీనంగా.. ఆదరణ కొరవడి .. అధ్వానంగా మారిన సర్కారు బడికి జవసత్వాలు తీసుకువచ్చాడు. ఈ ప్రాథమిక పాఠశాల జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలో ఉంది. ప్రభుత్వ ప్రధానోపాధ్యాయుడు చిదురాల శ్రీనివాస్ బడి బాగు కోసం సొంతంగా రూ.4 లక్షలు వెచ్చించి కొత్త అందాలు తీసుకొచ్చారు.

చెరువును తలపించేది..

వర్షం కురిస్తే పాఠశాల చెరువును తలపించేది. సమస్య పరిష్కారం కోసం కూలీలను పెట్టి రెండు రోజుల పాటు చెత్తా చెదారాన్ని తొలగించారు. సీసీ చేయించారు. పాఠశాల ఆవరణ ఇప్పుడు చెట్లతో ఆహ్లాదకరంగా ఉంది. ఇప్పుడు విద్యార్థుల తల్లిదండ్రులు సంతోషంగా ఉన్నారు. బడులు అన్ని ఇలాగే ఉంటే ప్రైవేటు పాఠశాలలు తాళాలు వేసుకోవాల్సిందే..

బదిలీల్లో భాగంగా గత సంవత్సరం ఇక్కడికి వచ్చిన శ్రీనివాస్ పాఠశాల పరిస్థితిని చూసి చలించిపోయాడు. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండడం మరింత కలిచి వేసింది. మీరు ఎందుకు పిల్లలను చేర్పడం లేదని చుట్టు పక్కల తల్లిదండ్రులను అడగ్గా వారు అక్కడి కనీస సౌకర్యాలు లేవని చెప్పడంతో కలత చెందాడు. దీంతో రూ. 4లక్షలు సొంత ఖర్చులతో ప్రైవేటు పాఠశాలను మరిపించేలా గోడలపై రంగు రంగుల బొమ్మలను వేయించాడు. సందేశాత్మక సూక్తులు రాయించాడు.

ఇంగ్లిష్ అక్షరమాల, స్ఫూర్తినిచ్చే జాతీయ నాయకుల చిత్రాలను పర్యావరణం పరిరక్షణకు నడుం బిగించే బొమ్మలు, సూక్తులతో పాఠశాల గోడల్ని నింపాడు. అంతేకాదు, మూత్రశాలలు, మరుగుదొడ్లకు రంగులు, టైల్స్ వేయించాడు. ఉపాధ్యాయుడి సంకల్పంతో 55 మంది విద్యార్థులు కొత్తగా ప్రవేశాలు పొందారు. ప్రభుత్వ పాఠశాలలో 95 మంది విద్యార్థులు ఉండగా ప్రవేశాల ప్రక్రియ కొనసాగుతోంది. శ్రీనివాస్ బోధనలోనూ వైవిధ్యం చూపుతూ విద్యార్థుల నైపుణ్యాలను మెరుగు పరిచేందుకు కృషి చేస్తున్నారు. విద్యార్థులతో పాటు నేలపై కూర్చుని బొమ్మలు, చార్టులు ఇతర పరికరాలు ఆధారంగా విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తున్నాడు. ప్రస్తుతం పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులు పని చేస్తున్నారు.

బడిని బాగు చేయడం ఆనందంగా ఉంది..

చిదురాల శ్రీనివాస్, హెచ్‌ఎం



పుట్టిన ఊరు, జన్మనిచ్చిన తల్లిదండ్రులను మరిచిపోవద్దు. సొంత ఊరు పాలకుర్తిలో సర్కారు బడిని బాగు చేసుకోవడం ఆనందంగా ఉంది. ఈ పాఠశాలకు బదిలీపై వచ్చినప్పుడు విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉంది. ప్రస్తుతం గోడలకు రంగులు వేయించాను. గేటు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించా. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు వారి పిల్లలను మా పాఠశాలలో చేర్పించేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. పాఠశాల పరిసరాలు బాగుంటే విద్యార్థులను ఆకర్షించవచ్చని ఆలోచించాను. దాని కోసం నేను రూ.4 లక్షలు ఖర్చు చేశా.


డైట్ కాలేజీ ప్రాంగణంలో చెట్లను నరికివేసిన దృశ్యం

డైట్‌లో అడ్డగోలుగా చెట్ల నరికివేత

» 20కి పైగా నేలకూలిన భారీ వృక్షాలు
» ప్రిన్సిపాల్ అబ్దుల్‌హై పై అటవీ శాఖ అధికారులకు పర్యావరణ వేత్తల ఫిర్యాదు

హనుమకొండ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): భావిభారత పౌరులను తీర్చిదిద్దే, వారికి విద్యాబుద్ధులు నేర్పే ఉపాధ్యాయులను తయారు చేసే జిల్లా ఉపాధ్యాయ శిక్షణ సంస్థలోనే నిబంధనలకు విరుద్ధమైన పనులు జరుగుతున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పర్యావరణానికి హాని కలిగించే చర్యలకు అధికారులే పూనుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. చెట్లను పెంచాలని ప్రభుత్వం ఒక పక్క చెబుతూ వన మహోత్సవాల పేరుతో రూ. కోట్లు వెచ్చిస్తుంటే.. అందుకు విరుద్ధంగా హనుమకొండలోని జిల్లా ఛాత్రోపాధ్యాయ శిక్షణా సంస్థ (డైట్)లో విచక్షణా రహితంగా చెట్లను నరికివేస్తున్నారు. కొద్ది రోజుల క్రితం డైట్ ప్రాంగణంలో ఏపుగా పెరిగిన సుమారు 20 చెట్లను నేలకూల్చారు. డైట్‌లోని విశాలమైన ప్రాంగణంలో పచ్చదనం కోసం మరిన్ని చెట్లను పెంచాల్సింది పోయి ఉన్న చెట్లను నరికి వేయడం పట్ల ప్రకృతి ప్రేమికులు, పర్యావరణవేత్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఈ మేరకు ఈనెల 17న ఈ విషయమై జిల్లా అటవీ శాఖ అధికారికి ఫిర్యాదు చేశారు. డైట్ ప్రిన్సిపాల్ అబ్దుల్‌హైతో పాటు మరో ముగ్గురు సిబ్బంది ఎం.సోమయ్య, సతీశ్‌చంద్ర, మానస్... అటవీ శాఖ, పర్యావరణ పరిరక్షణ సంస్థ అధికారుల ముందస్తు అనుమతి లేకుండా డైట్ ప్రాంగణంలోని పెద్ద పెద్ద చెట్లను నరికించారని అందులో పేర్కొన్నారు. ఈ చర్య పర్యావరణ చట్టం-1980, ఇతర సంబంధిత పర్యావరణ పరిరక్షణ చట్టాలకు పూర్తి విరుద్ధమని, చెట్ల నరికివేత వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బ తింటుందని ఆందోళన వ్యక్తం చేశారు.

నరికివేసిన చెట్లలో విలువైన టేకు తదితర చెట్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఉన్నత పదవుల్లో ఉండి, చట్టాలు, నిబంధనలు తప్పకుండా పాటించాల్సిన అధికారులే ఇలాంటి చర్యలకు పాల్పడడం తీవ్రమైన తప్పిదంగా భావించి ఈ మొత్తం వ్యవహారంపై విచారణ జరపాలని, బాధ్యులను కఠినంగా శిక్షించాలని వారు కోరారు. దీంతో స్పందించిన అటవీ శాఖ అధికారులు డైట్‌లో నరికిన చెట్లను పరిశీలించారు. జరిగిన నష్టాన్ని అంచనా వేశారు. చెట్ల నరికివేతను తీవ్రంగా పరిగణించిన అట వీ శాఖ అధికారులు బాధ్యులపై చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది.

హోటల్‌లోకి దూసుకెళ్లిన ట్రాక్టర్

2 బైక్‌లు ధ్వంసం.. ఒకరికి గాయాలు

నర్సంపేట టౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : నర్సంపేట మునిసిపాలిటీకి చెందిన ట్రాక్టర్ అదుపు తప్పి రోడ్డు పక్కనున్న హోటల్‌లోకి దూసుకెళ్లింది. ఈ సంఘటన నర్సంపేట పట్టణంలోని మల్లంపల్లిరోడ్‌లో శనివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. నర్సంపేట మునిసిపాలిటీకి చెందిన ట్రాక్టర్ పైపులైన్ మరమ్మతుల కోసం కమలాపురం నుంచి అంబేద్కర్ సెంటర్ వైపు వస్తుండగా మార్గమధ్యంలో అదుపు తప్పి రోడ్డు పక్కనున్న హోటల్‌లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. దీంతో అక్కడ ఉన్న రెండు బైక్‌లు ధ్వంసం కాగా, ఒకరికి గాయాలయ్యాయి. గాయపడిని వ్యక్తిని ఆస్పత్రికి తరలించారు. ఇదిలావుండగా సరైన డ్రైవింగ్ రాని వ్యక్తి నడపడం వల్లనే ట్రాక్టర్ హోటల్‌లోకి దూసుకెళ్లి ప్రమాదం జరిగిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.


హోటల్‌లోకి దూసుకెళ్లి బోల్తా పడిన మునిసిపల్ ట్రాక్టర్

మల్టిపుల్ ఫ్యాక్టరీతో కల సాకారం

(5వ పేజీ తరువాయి)

కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. పనులు వేగంగా జరుగుతున్నాయని, అనుకున్న సమయానికి మ్యానుఫ్యాక్చరింగ్ ప్రారంభిస్తామని రైల్వే మంత్రి తెలిపారు.

స్థానికులకు ఉద్యోగాలపై రాష్ట్రానిదే నిర్ణయం : కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

కాజీపేట మల్టిపుల్ రైల్వే ఫ్యాక్టరీలో స్థానికులు, భూనిర్వాసితులకు ఉద్యోగాలపై రాష్ట్ర ప్రభుత్వమే నిర్ణయం తీసుకుంటుందని కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి తెలిపారు. ఫ్యాక్టరీ కోసం ఎవరెవరు భూములు ఇచ్చారో కలెక్టర్ ఇచ్చే నివేదిక ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే సూచనల మేరకు ఫ్యాక్టరీలో స్థానికులు ఉద్యోగాలు ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తామని కిషన్‌రెడ్డి తెలిపారు. గత 40ఏళ్లకు పైగా కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఉందన్నారు. గతంలో పీవీ నరసింహారావు హయంలో కూడా కోచ్ ఫ్యాక్టరీ కోసం ప్రయత్నాలు జరిగాయని అన్నారు. తెలంగాణ ఉద్యమంలోనూ వరంగల్‌లో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఉందన్నారు. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్వయంగా కాజీపేటలో మల్టిపుల్ ఫ్యాక్టరీ కోసం భూమి పూజా చేశారని తెలిపారు. ఈ ఫ్యాక్టరీతో పరోక్షంగా వేలాది మందికి ఉపాధి కలుగుతుందని, ప్రత్యక్షంగా 3వేల మందికి ఉద్యోగావకాశాలు ఉంటాయన్నారు. స్థానికులకు ఉద్యోగావకాశాలపై రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే సూచనల ప్రకారం ముందుకు వెళతామని కిషన్‌రెడ్డి తెలిపారు.

వరంగల్ సమగ్ర అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందన్నారు. వరంగల్ రింగ్‌రోడ్డులో 50శాతం కేంద్రమే పూర్తి చేసిందన్నారు. వరంగల్‌లో ఎయిర్ పోర్టు అవసరం ఎంతో ఎందని గత బీఆర్‌ఎస్ హయంలో అప్పటి సీఎం కేసీఆర్‌కు అనేకసార్లు లిఖితపూర్వకంగా విన్నవించానని తెలిపారు. ఎయిర్‌పోర్టుకు కావాల్సిన భూమిని గత ప్రభుత్వం ఇవ్వలేక పోయిందని ఆరోపించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎయిర్‌పోర్టుకు అవసరమైన భూమిని సేకరించి, విమానాయశాఖకు అందిస్తే పనులు మొదలు పెడుతామన్నారు.

ఈ కార్యక్రమంలో రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ, సికింద్రాబాద్ డివిజనల్ మేనేజర్ భరతేష్ కుమార్‌జైన్‌తో పాటు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు, ఎంపీ కడియం కావ్య, మేయర్ సుధారాణితో పాటు బీజేపీ ఎమ్మెల్యేలు మహేశ్వర్‌రెడ్డి, రాకేష్‌రెడ్డి, హరీష్‌రెడ్డితో పాటు జాతీయ, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

తోపులాట.. గందరగోళం

కాజీపేట (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రులు అశ్వినీ వైష్ణవ్, కిషన్‌రెడ్డి కాజీపేట పర్యటన నేపథ్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా బీజేపీ నాయకులు రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. అయితే వారిని స్టేషన్‌లోకి రా కుండా పోలీసులు అడ్డుకున్నారు. మంత్రులు రైల్వే స్టేషన్‌కు రాగానే కలెక్టర్ స్నేహ శబరీష్ పూలమొక్క ఇచ్చి ఆహ్వానం పలికారు. అనంతరం బీజేపీ కార్యకర్తలు స్టేషన్‌లోకి ఒక్కసారిగా తోసుకురావడంతో తోపులాట జరిగింది. ఈ సందర్భంగా ఓ వ్యక్తి చేయి, మరో వ్యక్తి కాలుకు తీవ్రగాయాలయ్యాయి.


↑ కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు వినతిపత్రం ఇస్తున్న కావ్య, సుధారాణి

జంక్షన్ అభివృద్ధికి సహకరించండి : ఎంపీ కడియం కావ్య

తెలంగాణలో కీలకమైన కాజీపేట రైల్వే కనెక్టివిటీ, సౌకర్యాలను మెరుగు పర్చటంతో పాటు రైల్వే తయారీ యూనిట్ పనులను వేగవతం చేయాలని వరంగల్ ఎంపీ కడియం కావ్య రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కోరారు. ఈ మేరకు రైల్వే మంత్రికి ఎంపీ వినతిపత్రం ఇచ్చారు. కాజీపేటను రైల్వే డివిజన్‌గా మార్చాలని కోరారు. మల్టీ మోడల్ కనెక్టివిటీ ఇనిషియేటివ్ కింద కాజీపేట రైల్వే స్టేషన్ వద్ద బస్టాండ్ నిర్మాణం పూర్తి చేయాలని కోరారు. హసన్‌పర్తి- నష్కల్, చింతల్‌పల్లికి ప్రత్యామ్నాయ రైల్వే బైపాస్ ప్రతిపాదనల ను పునఃపరిశీలించాలని అభ్యర్థించారు. భూనిర్వాసితులు, స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఎంపీ విజ్ఞప్తి చేశారు.

డివిజన్ హోదా ఊసే లేదు..

నిరాశ పర్చిన రైల్వే మంత్రి పర్యటన

కాజీపేట, జూలై 19 (ఆంధ్రజ్యోతి): రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ శనివారం కాజీపేట పర్యటన గంట ఆలస్యంగా సాగింది. కోచ్ ఫ్యాక్టరీలో 3.15 గంటలకు మీడియాతో మాట్లాడిన రైల్వే మంత్రి కోచ్‌ఫ్యాక్టరీ అభివృద్ధి, దాని నిర్మాణం తీరు మాత్రమే వివరించారు. అశ్వినీ వైష్ణవ్ కాజీపేట జంక్షన్‌ను డివిజన్‌గా ఏర్పాటు చేసే విషయం ఉసెత్తకుండానే తన ప్రసంగాన్ని ముగించారు. దీంతో స్థానికులు, రైల్వే కార్మిక వర్గాలు, పలు రాజకీయ పార్టీల నేతలు నిరాశ చెందారు. డివిజన్ ప్రస్తావన రాకపోవడం బాధాకరమని పలుకార్మిక నాయకులు బహిరంగంగానే చర్చించుకున్నారు. విశాఖ కేంద్రంగా సౌత్ కోస్ట్ జోన్ గా ప్రకటించినప్పుడు కాజీపేట డివిజన్ కూడా ప్రకటించాల్సి ఉంది. ఆలస్యమైనా శనివారం రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ నేరుగా కాజీపేటకు వస్తుండడంతో డివిజన్ ప్రకటన ఉంటుందనే చాలా మంది ఊహించారు. అలాంటి ప్రకటన రాకపోవడంతో స్థానికులు నిరుత్సాహానికి గురయ్యారు. ఇదే కాకుండా ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన రైల్వే ప్రాజెక్ట్ లైన కాజీపేట - సికింద్రాబాద్ మూడో రైల్వే లైన్, కాజీపేటలో ట్రయాంగిల్ ప్లాట్‌ఫారాలు, డోర్నకల్- మిర్యాలగూడ 105 కిలోమీటర్ల రైల్వే లైన్ నిర్మాణం గురించికాని, నష్కల్ - హసన్‌పర్తి 461 కోట్లతో నూతన రైల్వే నిర్మాణం గురించి కూడా రైల్వే మంత్రి ప్రస్తావించలేదు.

భూ తగాదాలో 19 మందిపై కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ మండలం ఇస్లావత్‌తండా (ఎం) పరిధిలోని భూ తగాదాలో ఘర్షణ పడిన 19 మందిపై కేసు నమోదు చేసినట్లు కురవి ఎస్సై సతీష్ శనివా రం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకా రం.. ఇస్లావత్ తండాకు చెందిన గిరిజన రైతులు భూ తగాదా విషయంలో గొడవపడి ఇరు వర్గాలు దాడులు చేసుకున్నారని చెప్పారు. ఈ ఘటనలో ఇస్లావత్ వనిత, మరోవర్గం భూక్య మోతీలాల్ ఇచ్చిన ఫిర్యాదులతో 19 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

లైంగిక వేధింపులపై కమిటీ ఏర్పాటు

బీఈడీ విద్యార్థుల ఫిర్యాదుపై విచారణ

కేయూ క్యాంపస్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ బీఈడీ విద్యార్థులపై లైంగిక వేధింపులకు పాల్పడ్డరనే ఆరోపణల నేపథ్యంలో వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డి ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రం విచారణ కమిటీని నియమించారు.

ఛైర్మన్‌గా ఆంగ్ల విభాగం అధిపతి ఆర్. మేఘనరావుతో పాటు క్యాంపస్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె.మమత, ఫిజిక్స్ విభాగాధిపతి డి.మంజుల, అకౌంట్స్ విభాగం అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్రీలతదేవి విచారణ కమిటీ బాధ్యులుగా నియమించారు. వీరు శనివారం కేయూ క్యాంపస్‌లోని బీఈడీ కళాశాలలో మొదటి దఫా విచారణ చేపట్టారు. క్యాం పస్ కళాశాల బీఈడీ విద్యార్థులు 24 మంది స్వయంగా సంతకాలు చేసి మహిళ విద్యార్థులపై జరిగిన లైంగిక వేధింపులపై ఫిర్యాదు చేశారు. వాటి ఆధారంగా విచారణ జరిపారు. ఈ నెల 22న మంగళవారం మరో దఫా కళాశాలకు వచ్చి విద్యార్థులతో నేరుగా మాట్లాడి బాధ్యులపై చర్యలకు సిఫార్సు చేసే అవకాశం ఉంది. కాగా, కొన్నేళ్ళుగా టీచింగ్ ప్రాక్టీస్‌లో ఉన్న ఇద్దరు అధ్యాపకులు విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారనే ఆరోపణలున్నాయి.

ఎరువుల షాపులు తనిఖీ

కేసముద్రం, జూలై 19 (ఆంధ్రజ్యోతి) :కేసముద్రంలో ఎరువుల షాపులను, పీఏసీఎస్ కేంద్రాలను శనివారం ఏవో వెంకన్న తనిఖీ చేశారు. ఈ సందర్భంగా షాపుల్లోని ఎరువుల నిల్వలు, అమ్మకాల రికార్డులను పరిశీలించారు. ఎప్పటికప్పుడు రికార్డులను అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. మండలంలో ప్రైవేటు దుకాణాలు, సొసైటీల్లో 323మెట్రిక్ టన్నుల యూరియా, 53 మెట్రిక్ టన్నుల డీఏపీ, 44 మెట్రిక్ టన్నుల పొటాష్, 115 మెట్రిక్ టన్నుల సూపర్, 534 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువుల నిల్వలు ఉన్నాయని తెలిపారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి.. పీఈటీ నాగేశ్వర్

• కవి, గాయకుడు, కళాకారుడిగా రాణింపు
• నిరుపేద కుటుంబంలో పుట్టి పీఈటీగా ఉద్యోగం సాధించి..
• వరించిన అవార్డులు, పురస్కారాలు

మహబూబాబాద్ టౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : నిరుపేద కుటుంబంలో జన్మించి.. మొక్కవోని దీక్షతో ముందుకు సాగి.. జీవనోపాధి కోసం దశాబ్ద కాలం కల్లుగీత వృత్తిని కొనసాగించి.. కష్టాలను అధిగమించి ఉన్నత విద్యాభ్యాసం పూర్తి చేసి పీఈటీగా ఉద్యోగం సంపాదించిన జక్కి. నాగేశ్వర్ అందరికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఎంతో మంది విద్యార్థులను రాష్ట్ర, జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దుతున్నారు. నిరుపేద కుటుంబంలో జన్మించి ఉన్నత విద్యను చదివి సర్కారు కొలువు సాధించి చదువుకు పేదరికం అడ్డుకాదని నిరూపించాడు... పీఈటీగా ఉద్యోగం నిర్వహిస్తూనే కవి, గాయకుడు, కళాకారుడిగా సామాజిక సేవ పాటలు రచిస్తూ, పాడుతూ, ప్రదర్శనలిస్తూ ప్రజల్లో చైతన్యం నింపుతున్నారు.


నాటక ప్రదర్శనలో జక్కి. నాగేశ్వర్

క్రీడాకారులను తీర్చిదిద్దుతూ..

నెల్లికుదురు మండలం ఆలేరు ఉన్నత పాఠశాలలో తొలి పోస్టింగ్‌లో పీఈటీగా చేరారు. పాఠశాల వేళలు పూర్తయ్యాక ఇంటికి వెళ్లకుండా రాత్రి 7 గంటల వరకు విద్యార్థులకు క్రీడా మెళకువలు నేర్పించేవాడు. 22 మందిని కబడ్డీ, ఖో-ఖో విభాగంలో 20 సార్లు రాష్ట్ర స్థాయి, రెండు జాతీయ స్థాయి క్రీడాపోటీల్లో పాల్గొనేలా తీర్చిదిద్దారు. 2018-24 వరకు కురవి మండలం నేరడలో పని చేసి ఆరుగురు విద్యార్థినులు టెన్నికాయిట్‌లో 13 సార్లు రాష్ట్రస్థాయి, ఐదు జాతీయ స్థాయి ఆటల్లో పోటీపడేలా కృషి చేశారు. 2024 నుంచి తన సొంతూరు చిన్నగూడూరులో పని చేస్తున్నారు.


జక్కి.నాగేశ్వర్‌ను సన్మానిస్తున్న అప్పటి మహబూబాబాద్ కలెక్టర్ శశాంక

నిరుపేద కుటుంబంలో జన్మించి..

మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరుకు చెందిన నిరుపేద దంపతులు జక్కి అంతయ్య, వరమ్మ దంపతుల కుమారుడు నాగేశ్వర్. టెన్త్ వరకు తన సొంతూరులో విద్యనభ్యసించాడు. 1991-93 వరకు మానుకోటలోని ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ పూర్తి చేశారు. ఆర్థిక ఇబ్బందులతో విద్యను ఆపేసి 1995లో కుల వృత్తి కల్లుగీతను ఎంచుకున్నారు. 1997లో మళ్లీ విద్యను ఆరంభించి డిగ్రీ, ఎంఏ (హిస్టరీ), బీపీఈడీ పూర్తి చేశారు. 2008 డీఎస్సీలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా సర్కారు కొలువు సంపాదించి ఉపాధ్యాయ వృత్తిలోకి ప్రవేశించారు.

అక్కడ నుంచి విద్యార్థి పుల్‌చంద్ రాష్ట్ర స్థాయి ఖో-ఖో పోటీలో పాల్గొని ప్రతిభ చాటాడు. తాను కూడా 2017, 2022లో హైదరాబాద్‌లో జరిగిన జాతీయ స్థాయి (35 సంవత్సరాలు పైబడిన) మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో లాంగ్ జంప్, హైజంప్, ట్రిపుల్ జంప్‌లో పతకాలు సాధించారు. 2023 సెప్టెంబరు 5న ఉపాధ్యాయ దినోత్సవం రోజు కలెక్టర్ శశాంక చేతుల మీదుగా ఉత్తమ పీఈటీగా అవార్డును అందుకున్నారు.

వివిధ నాటకాల ప్రదర్శన

జక్కి. నాగేశ్వర్ తన తండ్రి అంతయ్య వారసత్వాన్ని పుణికిపుచ్చుకుని సోదరులు వీరన్న, చంద్రయ్యలను అనుకరిస్తూ చిన్ననాటి నుంచి నాటకాలు ప్రదర్శించేవారు. చిన్నగూడూరులో తోటి కళాకారులతో కలిసి పండుగ రోజుల్లో కనకతార, సత్యహరిశ్చంద్ర, మార్కండేయ, భక్తప్రహ్లాద, చంద్రహాస లాంటి నాటికలు వేశారు. 2023 తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో తాను రాసిన 'ఇదిరా తెలంగాణ పోరు' అన్న కవితకు ఉత్తమ కవిగా ఎంపికయ్యారు.

గోల్డెన్ అవర్

» సైబర్ నేరాల కట్టడికి మొదటి గంటే కీలకం
» సకాలంలో ఫిర్యాదు చేస్తే సొమ్ము వెనక్కి

కృష్ణకాలనీ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానంతో పాటు సైబర్ మోసాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఓ వైపు పోలీసుశాఖ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకొస్తున్నా.. అదే రీతిలో మోసాలు జరుగుతున్నాయి. సులభంగా డబ్బులు సంపాదించాలని కొందరు అమాయకులు డబ్బులు పోగొట్టుకుంటున్నారు. సైబర్ చోరులు సరికొత్త పంథాలో మోసాలకు పాల్పడుతూ పోలీసులకు సవాల్ విసురుతున్నారు. భూపాలపల్లి జిల్లా పరిధిలో గడిచిన ఆరు నెలల్లో చాలా మంది బాధితులు సైబర్ మోసాల బారిన పడి లక్షలాది రూపాయలు పోగొట్టుకున్నారు. బాధితుల కోసం పోలీసుశాఖ గోల్డెన్ అవర్ పేరుతో సైబర్ చోరుల కట్టడికి నూతన టెక్నాలజీని అందుబాటులోకి తెచ్చింది. దీన్ని సద్వినియోగం చేసుకుంటే బాధితులకు కాస్త ఊరట లభించనుంది.

విద్యావంతులే అధికం..

సైబర్ మోసాల బారిన పడుతున్న వారు దాదాపు ఎక్కువ గా చదువుకున్న వారే ఉండడం గమనార్హం. ఎంతో శ్రమించి సం పాదించుకున్న డబ్బులను చాలా తెలివిగా, బెదిరింపులకు గురి చేసి, ఆశ చూపి.. ఇలా సైబర్ మోసాలకు పాల్పడుతుండగా బాధితులు మోసపోతూనే ఉన్నారు. ఏమి తెలియక కొందరు మోసపోతుంటే.. అన్నీ తెలిసిన వారే అధికంగా మోసపోతుండడం విస్మయానికి గురి చేస్తోంది.

మొదటి గంట కీలకం..

గోల్డెన్ అవర్ అంటే ఏదైన ఘటన జరిగిన గంట వ్యవధిలో తీసుకునే చర్య. ప్రమాదాల్లో గాయపడిన వారి ప్రాణాలు కాపాడేందుకు గోల్డెన్ అవర్ కీలకం. అలాగే సైబర్ నేరాల్లో నిందితుల్ని పట్టుకునేందుకు, బాధితులు పోగొట్టుకున్న సొమ్మును రికవరీ చేసేందుకు తొలి గంట అంతే కీలకం. తమ డబ్బును పోగొట్టుకున్న గంటలో ఫిర్యాదు చేస్తే బ్యాంకు ఖాతాను హోల్డ్ చేస్తారు. సైబర్ ఉచ్చులో పడి నగదును పోగొట్టుకున్న బాధితులు గంటలోపు 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేస్తే కాస్త మేలు జరిగే అవకాశం ఉంది.

పలు విధాలుగా వల

సైబర్ నేరగాళ్లు వివిధ రకాలుగా అమాయకులు వలేస్తున్నారు. ప్రధానంగా టెలిగ్రామ్‌ను ఉపయోగిస్తున్నారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని, డబ్బులు డబుల్ చేస్తామని మరికొందరు వాట్సాప్‌లలో వచ్చే తెలియని లింక్‌లను ఓపెన్ చేస్తూ ఇంకొందరు ఏదో రకంగా సైబర్ మోసాల బారిన పడుతున్నారు. రైతు బంధు సమయంలో ఓటీపీలు అడుగుతూ.. పీఎం కిసాన్‌కు సంబంధించి ఈకేవైసీ చేయించుకోవాలని అప్‌డేట్ చేయాలని ఫోన్‌లు చేస్తుంటారు. అలాగే, ఒక వాట్సాప్ గ్రూపు క్రియేట్ చేసి అందులో వారే 20 మంది ఉండి అమాయకుల ఒక నెంబర్ యాడ్ చేసి గ్రూపులు చర్చిస్తారు. ఎవరినైతే యాడ్ చేస్తారో వారినే టార్గెట్ చేసి మోసపోయే స్థితికి తీసుకొస్తారు. ఈ మధ్య డిజిటల్ అరెస్ట్ పేరుతో కొత్త మోసాన్ని తెరమీదకు తెచ్చారు. ఉన్నత చదువులు, ఉద్యోగాల చేస్తూ నాగ్‌పూర్, ఢిల్లీ, చెన్నై ఇతరత్రా ప్రాంతాల్లో ఉండేవారి వివరాలు సేకరిస్తారు. వారి తల్లిదండ్రులకు ఫోన్ చేసి మేము నేషన్ నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో నుంచి మాట్లాడుతున్నామని చెబుతారు. 'మీ కుమారుడిని గంజాయి కేసులో పట్టుకున్నాం.. కేసు కాకుండా వదిలేయాలంటే రూ. 2లక్షలు పంపించాలి' అని డిమాండ్ చేస్తారు. పూర్తి స్థాయిలో నమ్మించేందుకు వీడియో కాల్స్ సైతం చేస్తారు. ఈ తరహా మోసాలు వరంగల్, హైదరాబాద్ వంటి ప్రాంతాల్లో ఎక్కువగా జరుగుతున్నాయి.

ఆరు నెలల్లోనే రూ.96.70 లక్షలు మాయం

భూపాలపల్లి జిల్లాలో సైబర్ మోసాలు మితిమీరుతున్నాయి. గడిచిన ఆరు నెలల్లో జిల్లాలో 136 మంది సైబర్ నేరగాళ్ల వలలో పడ్డారు. వీరంతా కలిపి రూ.96,70,500 నగదును చేజేతులారా పోగొట్టుకున్నారు. ఫిర్యాదు చేసిన బాధితుల రూ.18,27,090 హోల్డ్ చేశారు. రెండు సర్కిళ్ల పరిధిలో 131 మంది బాధితులు రూ. 89,47,483 పోగొట్టుకున్నారు. ఇక కాటారం సబ్ డివిజన్‌లో రూ.1,09,678 సైబర్ నేరగాళ్ల ఖాతాల్లోకి వెళ్లగా.. రూ.7,23,017 నగదును పోలీసులు స్తంభింపజేశారు.

గంటలోపే ఫిర్యాదు చేయాలి

కిరణ్‌ఖరే, ఎస్పీ భూపాలపల్లి జిల్లా



సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఒకవేళ డబ్బులు పోగొట్టుకుంటే గంటలోపే 1930, స్థానిక పీఎస్‌లో గానీ ఫిర్యాదు చేయాలి. దీంతో డబ్బులను వెంటనే హోల్డ్ చేసి తిరిగి తెప్పించే వీలు ఉంటుంది. చాలా మంది ఆలస్యంగా స్పందిస్తున్నారు. తెలియని వ్యక్తులకు ఎట్టి పరిస్థితుల్లో ఓటీపీలు చెప్పవద్దు. వాట్సాప్‌లలో వచ్చే తెలియని లింక్‌లను ఓపెన్ చేయొద్దు. అప్రమత్తంగా ఉండి మోసాల బారిన పడొద్దు.

ప్రయాణం.. ప్రాణ సంకటం

- రోడ్లపై వెళ్లాలంటే నరకమే..
- అధ్వానంగా వెంకటాపురం-చర్ల ప్రధాన రహదారి
- నెలరోజులుగా నిలిచిన ఆర్టీసీ సర్వీసులు
- కిలోమీటర్ల మేర పెద్ద పెద్ద గుంతలు
- ఇసుక లారీలతో నిత్యం ట్రాఫిక్ జామ్



కొండాపురంలో అధ్వానంగా ఉన్న రోడ్డు

వెంకటాపురం, జూలై 19(ఆంధ్రజ్యోతి): రోడ్డు జరంత దెబ్బతింటే ఎలాగో అడ్జెస్ట్ అయిపోతాం. ఒకటో రెండో గుంతలు ఉంటే ఎలాగో అలా ప్రయాణం సాగించొచ్చు. కిలోమీటర్ల మేర పెద్ద పెద్ద గుంతలు ఉంటే మాత్రం అవస్థలే. రోడ్డు అధ్వానంగా ఉంటే వాహనాలు వెళ్లేందుకు కష్టమే. వెంకటాపురం-చర్ల ప్రధాన రహదారి పరిస్థితి దీనికి అద్దం పడుతోంది. ఈ రోడ్డుపై ప్రయాణం అంటనే భయంతో ప్రజలు వణికిపోతున్నారు. కిలోమీటర్ల మేర అడుగుడునా పెద్ద పెద్ద గోతులు, గుంతలతో ఉన్న రోడ్డుపై ఎలా ప్రయాణించాలని వెంకటాపురం ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏజెన్సీ ప్రజలు రోడ్డును బాగు చేయాలని ఎన్నిసార్లు ఆందోళన చేసినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మూడేళ్లుగా నరకమే..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో భద్రాచలం నుంచి నేరుగా వెంకటాపురం వరకు సుమారు 100 కిలోమీటర్ల మేర ఆర్అండ్బీ రహదారిని 2008లో నిర్మించారు. నాటి నుంచి అప్పుడప్పుడు మాత్రమే నిర్వహణకు నోచుకున్న ఈ రహదారి అత్యంత అధ్వాన స్థితికి చేరుకొని ప్రయాణాలకు సంకటంగా మారింది. ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా రోడ్డును మాత్రం బాగు చేసే నాథుడే కరువయ్యాడని స్థానికులు, ప్రయాణికులు అంటున్నారు. మూడేళ్ల నుంచి ఇసుక లారీలతో మరింత దారుణంగా రోడ్డు తయారైంది. సుమారు 30 కిలోమీటర్ల మేర గోతులు, గుంతల మయంగా మారింది. నిత్యం ఇసుక లారీలు వందల సంఖ్యలో తిరుగుతుండటంతో సామాన్య ప్రయాణికులకు రోడ్డుపై ప్రయాణం ప్రాణ సంకటంగా నిలిచింది. ఇప్పటికే ఇక్కడ పదుల సంఖ్యలో ప్రమాదాలు జరిగాయి. పలువురు ప్రాణాలు వదలగా, మరికొందరు తీవ్రగాయాలై మంచాన పడ్డారు.

వీరభద్రవరం నుంచి ఎదిర గుట్టల వరకు ఉన్న రహదారి దారుణంగా ఉంది. నిత్యం భద్రాచలం, చర్లకు వెళ్లే వారు 50 కిలోమీటర్ల అదనంగా ప్రయాణించి ఏటూరునాగారం, మణుగూరు మీదుగా భద్రాచలం, చర్ల ప్రాంతాలకు వెళ్తున్నారంటే రోడ్డు పరిస్థితి ఏమేరకు ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుత వర్షాకాలంలో రాత్రి వేళ ప్రయాణం మరింత దారుణంగా ఉందని ప్రయాణికులు అంటున్నారు. కారులు, ఆటోలు గోతులల్లో దిగబడి దెబ్బతింటున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిలిచిపోయిన ఆర్టీసీ సర్వీసులు

గత ఏడాది వర్షాలకు ఎదిర గుట్టల వద్ద ఉన్న రాళ్ల వాగు వంతెన పగుళ్లు తేలడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో అధికారులు వంతెన పక్క నుంచి డైవర్షన్ను ఏర్పాటు చేసి వాహనాలను మళ్లించారు. ఈ క్రమంలో నెల రోజులుగా ఇసుక లారీలు, వర్షాలతో రోడ్డు దారుణంగా ఉండటంతో ఆర్టీసీ అధికారులు భద్రాచలం నుంచి వచ్చే బస్సు సర్వీసులను నెల రోజులుగా నిలిపివేశారు. పెద్ద పెద్ద గోతులలో బస్సులు దిగబడుతుండటంతో చేసేదేమీ లేక ఈ నిర్ణయం తీసుకున్నారు. భద్రాచలం నుంచి వెంకటాపురం వరకు రోజు సుమారు 15 బస్సుల వరకు సర్వీసులు నడిపేవారు. ఆర్టీసీ సర్వీసులను నిలిపివేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి జేబులను గుల్ల చేసుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అత్యవసరమైతే అంతే సంగతులు...

వెంకటాపురం మండల ప్రజలకు నిత్యం భద్రాచలం, చర్ల ప్రాంతాలతో సత్సంబంధాలు ఎక్కువగా ఉంటాయి. అనారోగ్యానికి గురైనా ఇతర అవసరాల కోసమైనా ఎక్కువగా భద్రాచలం వైపు వెళ్తుంటారు. ఈ క్రమంలో రహదారి అధ్వానంగా ఉండటంతో ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. అత్యవసర పరిస్థితులు వస్తే తమ పరిస్థితి ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. కనీసం 108 అంబులెన్స్ వచ్చే పరిస్థితి లేదని, ప్రధాన రహదారి ఇలా ఉంటే అంతర్గతంగా ఉన్న గ్రామాల పరిస్థితి ఏమటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలే వర్షాకాలం.. వాగులు, వంకలు పొంగి ప్రమాదాలు సంభవిస్తే ఆపదలో ఆదుకునే వారు ఎలా వస్తారని గిరిజన ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అత్యవసరంగా వచ్చే అంబులెన్స్, ఫైర్ ఇంజన్ త్వరగా రావాలంటే రోడ్డు బాగుండాలని కదా అని అంటున్నారు. గర్భిణులు, బాలింతల పరిస్థితి మరింత దయనీయంగా ఉందని, ప్రసవ తేదీలకు ముందే రోడ్డు పరిస్థితి చూసి ఇతర ప్రాంతాలకు వెళ్తున్నారని తెలుస్తోంది.

పట్టించుకోని ప్రభుత్వం

మూడేళ్లుగా ప్రధాన రహదారి మరమ్మతులకు గురైతే గత ప్రభుత్వం, ప్రస్తుత పాలక ప్రభుత్వం పట్టించుకున్న దాఖలాలు లేవని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు, ములుగు జిల్లాలో ఓ మంత్రి ఉన్నప్పటికీ రోడ్డు దృష్టి పెట్టడంలేదని అంటున్నారు. ఇప్పటికైన స్పందించి త్వరితగతిన వెంకటాపురం-చర్ల ప్రధాన రహదారిని నిర్మించి ఇసుక లారీలను నియంత్రించాలని కోరుతున్నారు.



ఆలుబాకలోగోతులమయంగా ఉన్న రోడ్డు

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి : సీపీఎం

గోవిందరావుపేట, జూలై 19 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గొంది రాజేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పస్రా గ్రామ ఎకమిటీ ఆధ్వర్యంలో నాయకులు ప్రధాన రహదారి నుంచి గ్రామపంచాయతీ వరకు శనివారం ర్యాలీ నిర్వహించి ఆందోళనకు దిగారు. ఈసందర్భంగా రాజేష్ మాట్లాడుతూ పస్రా గ్రామంలో 950మంది ఇందిరమ్మ ఇళ్లకు అర్హులైనవారు ఉన్నారని కానీ, ప్రభుత్వం 52మందికి మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకుందని విమర్శించారు. కాంగ్రెస్ నాయకులు ఒక్కొక్కరి దగ్గరి నుంచి డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయని, అలాంటి వారిపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామంలోని నిరుపేదలను కాంగ్రెస్ నాయకులు భ్రమల్లో ముంచుతున్నారని, ప్రజలు వారి ప్రలోభాలకు గురికావొద్దని ఆయన కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం అర్హులైన పేదలకు ఇళ్లు మంజూరు చేయాలని, లేనట్లయితే రాబోయే ఎన్నికల్లో తగిన బుద్ధిచెబుతామని హెచ్చరించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని పంచాయతీ కార్యదర్శికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎంపార్టీ మండల కార్యదర్శి సోమ మల్లారెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు తుమ్మల వెంకటరెడ్డి,నాయకులు పొదిళ్ల చిట్టిబాబు, కడారి నాగరాజు, అంబాల మురళి, జిట్టబోయిన రమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎన్హెచ్ఆర్సీ జిల్లా చైర్మన్గా శ్రీధర్

కన్నాయిగూడెం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): జాతీయ మానవ హక్కుల కమిటీ ములుగు జిల్లా చైర్మన్గా కన్నాయిగూడెం మండలంలోని బుట్టాయిగూడెం గ్రామానికి చెందిన తాడూరి శ్రీధర్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం ఎన్హెచ్ఆర్సీ జాతీయ చైర్మన్ డాక్టర్ యాసీన్ ఆదేశాలతో రాష్ట్ర చైర్మన్ బద్దిపడగ శ్రీనివాసరెడ్డి నియామక పత్రం అందించారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

ఏటూరునాగారం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్కు వినతిపత్రం సమర్పించారు. మల్లంపల్లిలోని సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో కనీస సౌకర్యాలు లేవని, పాఠశాల భవనం శిథిలావస్థకు చేవడంతో వర్షం పడితే నీరు లోపలికి వచ్చి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పాఠశాలను ఏటూరునాగారానికి తరలించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి బట్ట స్వామి, జిల్లా ఉపాధ్యక్షులు సాదు రాకేష్, కోగిల బాలు, కమిటీ సభ్యులు ధనుష్, నిర్సింగరావు, మండల నాయకులు రాజేష్, వెంకటేశ్, ప్రవీణ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోకు ఈజీఎస్ ఉద్యోగుల వినతి

మంగపేట, జూలై 19 (ఆంధ్రజ్యోతి): తమకు నాలుగు నెలలుగా పెండింగ్లో ఉన్న వేతనాలను చెల్లించాలని కోరుతూ మండలంలోని ఈజీఎస్ ఉద్యోగులు స్థానిక ఎంపీడీవో భద్రుకు శనివారం వినతిపత్రాన్ని అందజేశారు. ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వం వేతనాలు ఇవ్వడం లేదని, దీంతో తమ కుటుంబాలు పస్తులు ఉండాల్సి వస్తోందని ఆవేదనను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీవో అంకూస్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం చేయాలి

వెంకటాపూర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులు ప్రకృతి వ్యవసాయం చేసి అధిక లాభాలు పొందాలని మండల వ్యవసాయ అధికారి శైలజ అన్నారు. మండలంలోని పాలంపేట, తిమ్మాపూర్ గ్రామాల్లో వెలుగురేఖ గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శనివారం జరిగిన అవగాహన సదస్సుల్లో ఆమె మాటాడారు. ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల అధిక దిగుబడి పొందొచ్చని అన్నారు. క్రిమిసంహారక రసాయనిక మందుల వాడకం తగ్గించి ప్రకృతి వ్యవసాయం చేసి ముందు తరాలవారికి ఆరోగ్యవంతమైన జీవితం అందించాలన్నారు. అనంతరం 125మంది రైతులను ఒక క్లస్టర్గా ఎంపిక చేశారు. ఈకార్యక్రమంలో ఏఈవోలు సునీల్, దయాన, వెలుగురేఖ గ్రామీణాభివృద్ధి సంస్థ సీఈవో రజిత, మాస్టర్ ట్రైనర్ సాంబయ్య, ఫార్మర్ ట్రైనర్ తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

అనుమతి లేని పాఠశాలల్లో చేర్పించొద్దు

తాడ్వాయి, జూలై 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని విద్యాశాఖ అనుమతులు లేని ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించొద్దని ఎంఈవో రేగ కేశవరావు అన్నారు. మండల కేంద్రంలోని సీఎస్ఐ పాఠశాలలో అనుమతులు కాకుండా తరగతులు నిర్వహిస్తున్నారనే సమాచారంతో ప్రధానోపాధ్యాయుడు సైల్రాజ్కు ఎంఈవో మెమో జారీ చేశారు. పాఠశాలను శనివారం సందర్శించిన ఆయన అనుమతులు మంజూరు కాకుండా పిల్లల తరగతులు ఎలా నిర్వహిస్తున్నారని సంజాయిషీని కోరారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని, వాటిల్లో తమ పిల్లలను చేర్పించినట్లయితే ప్రతి విద్యార్థికి ఉచితంగా దుస్తులు, పాఠ్యపుస్తకాలు, నోటుబుక్కులు అందిస్తామని తల్లిదండ్రులకు సూచించారు. ఆయన వెంట సీఆర్పీలు కల్యాణి, వసంతరావు, రవికుమార్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ నీలం బాబు తదితరులు ఉన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

తాడ్వాయి, జూలై 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గౌని అంజయ్య గౌడ్ కుటుంబాన్ని పార్టీ మండల అధ్యక్షుడు బోల్లు దేవేందర్ నాయకులు, కార్యకర్తలతో కలిసి శనివారం పరామర్శించారు. అంజయ్య చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మంత్రి సీతక్క, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ ఆదేశాల మేరకు అంజయ్య కుటుంబానికి రూ. 10,500 ఆర్థిక సహాయం అందించారు.ఈ కార్యక్రమంలో నాయకులు అర్రెం లచ్చుపటేల్, ఇర్ప సునీల్, పాక సాంబయ్య, భూషనబోయిన రవి, యానాల సిద్దిరెడ్డి, అనుమండ్ల రాజిరెడ్డి, కల్లెబోయిన భద్రయ్య, జగ్గం, పోషాలు, ఓదెల, సారయ్య, జైపాల్రెడ్డి, వెంకన్న, రమేష్, చారీ, వెంకటేష్, శ్రీధర్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటడం బాధ్యతగా తీసుకోవాలి

కృష్ణకాలనీ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం బాధ్యతగా తీసుకోవాలని భూపాలపల్లి సీఐ నరేష్కుమార్ అన్నారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని పోలీస్స్టేషన్ ఆవరణలో పోలీసు సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమం శనివారం జరగ్గా ఎస్సైలు సాంబమూర్తి, రమేష్, హెడ్కానిస్టేబుల్ మల్లయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

డీటీసీగా సురేశ్రెడ్డి



వరంగల్ క్రైం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): రవాణాశాఖ ఉమ్మడి జిల్లా డిప్యూటీ ట్రాన్స్పోర్ట్ కమిషనర్గా సురేశ్రెడ్డి నియమితులయ్యారు. సూర్యాపేట ఆర్టీవోగా విధులు నిర్వహిస్తున్న ఆయనను పదోన్నతిపై బదిలీ చేస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. కరీంనగర్ డీటీసీగా పని చేస్తున్న పురుషోత్తం ఇంతకాలం ఇక్కడ ఇన్చార్జి డీటీసీగా వ్యవహరించారు. తాజాగా సురేశ్రెడ్డి నియామకంతో పూర్తి స్థాయి డీటీసీ సేవలు అందుబాటులోకి రానున్నాయి. 1996 యంవిఐ బ్యాచ్కు చెందిన సురేశ్రెడ్డి.... ఉమ్మడి నల్గొండ జిల్లాలోని పలు ప్రాంతాల్లో విధులు నిర్వర్తించారు. రెండు మూడు రోజుల్లో ఆయన బాధ్యతలు స్వీకరించే ఆవకాశం ఉంది.

కాంగ్రెస్ సీనియర్ నాయకుడి మృతి



రాజయ్య (ఫైల్)

చిట్యాల, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ ఉప సర్పంచ్ కోడెల రాజయ్య (82) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. మృతదేహాన్ని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సందర్శించి అంత్యక్రి యల్లో పాల్గొన్నారు. మృతుడి కుటుంబ సభ్యులను మరామర్శించారు. ఎమ్మెల్యే వెంట పార్టీ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, మాజీ జడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, మాజీ సర్పంచ్ కొక్కుల సదానందం ఉన్నారు.

కెమిస్ట్రీ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

మొగుళ్లపల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొర్కిశాల మోడల్స్కూల్లో కెమిస్ట్రీ బోధించేందుకు పోస్టు ఖాళీగా ఉందని, అర్హులైనవారు ఈనెల 23లోగా దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ తాళ్లపల్లి రాకేష్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తొమ్మిదవతరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు గంటల ప్రాతిపదికన బోధించేందుకు పీజీ బీఎడ్ అర్హతలు తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని, ఉదయం 10గంటలకు డెమో ఉంటుందని తెలిపారు.

బీసీ హాస్టల్ను పరిశీలించిన ఎమ్మార్పీఎస్

మహదేవపూర్, జూలై 19(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని బీసీ హాస్టల్ను ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బెల్లంపల్లి సురేష్ శనివారం పరిశీలించారు. హాస్టల్లో తీవ్ర సమస్యలు ఉన్నాయని, దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. హాస్టల్లో కుక్కలు, పందులు స్వైర విహారం చేస్తున్నాయన్నారు. హాస్టల్లో బాత్ రూంలో సరిగా లేక నీరు అందక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అధికారులు స్పందించి ఈ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

కబ్జాకు గురైన ప్రభుత్వ భూమి స్వాధీనం

కాటారం, జూలై 19(ఆంధ్రజ్యోతి) :మండలంలోని గుమ్మళ్లపల్లిలో కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గ్రామానికి చెందిన కొందరు భూమిని కబ్జా చేయగా తహసీల్దార్ నాగరాజు, ఎంపీవో వీరస్వామికి పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ సమాచారం ఇచ్చారు. భూమి వద్దకు దీంతో ఆర్ఐ వెంకటయ్యను తహసీల్దార్ పంపారు. ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకోగా అందులో మొక్కలు నాటడానికి కార్యదర్శి ట్రాక్టర్తో దున్నించినట్లు సమాచారం.

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్కు కాంగ్రెస్ నేతల సన్మానం



రాజబాపును సన్మానిస్తున్న నేతలు

కాటారం, జూలై 19(ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్గా నియమితులైన బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోట రాజబాపును పలువురు రాష్ట్ర, జిల్లా, మండల కాంగ్రెస్ నేతలు మర్యాదపూర్వకంగా కలిసి శుభా కాంక్షలు తెలిపారు. బొకేలు అందించి శాలువాలతో సన్మానిం చారు. గ్రంథాలయాలను అభివృద్ధి చేయాలని కోరారు. రాజబాపును కలిసిన వారిలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్రెడ్డి, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు గద్దె సమ్మిరెడ్డి, తెప్పల దేవేందర్రెడ్డి, చీర్ల తిరుపతిరెడ్డి, దబ్బెట రాజేషం, బొడ్డు మల్లయ్య, రాంనారాయణ, ఉంసింగ్, గోనె మహేష్, అశోక్, ప్రభాకర్, శ్రీహరి తదితరులు ఉన్నారు.

'డబుల్ బెడ్రూం' లబ్ధిదారుల నిరసన



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న డబుల్ బెడ్రూం లబ్ధిదారులు

భూపాలపల్లి కలెక్టరేట్, జూలై 19(ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వంలో తమకు కేటాయించిన డబుల్ బెడ్రూం ఇళ్లను ఇతరులకు కేటాయించడాన్ని వ్యతిరేకిస్తూ పలువురు లబ్ధిదారులు కలెక్టరేట్ ఎదుట శనివారం నిరసనకు దిగారు. భూపాలపల్లి మునిసిపల్ పరిధిలోని భాస్కర్గడ్డలో బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్ల పంపిణీలో తమను లబ్ధిదారులుగా గుర్తించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే డబుల్ బెడ్రూం ఇళ్ల పంపిణీలో అక్రమాలు జరిగాయని, తమను అనర్హులుగా ప్రకటించారని ఆవేదన వ్యక్తం చేశారు. సొంతిల్లు లేక అద్దెకు ఉంటున్న తమకు డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించగా ఇప్పుడు వాటిని రద్దు చేయడం అన్యాయమన్నారు. కలెక్టర్ వెంటనే చొరవ తీసుకొని తమకు కేటాయించిన ఇళ్లను తమకే కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీలత, సురేష్, రమేష్, రాజబాబు, స్వర్ణలత, రమ, స్వప్న, స్వాతి, చంద్రశేఖర్, సమత, మహలక్ష్మి, సమ్మయ్య, సరిత, తిరుపతమ్మ, రాధిక, సుజుమ జమ, కొమురమ్మ, రమేష్, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

గుండ్రాత్పల్లిలో కుప్పకూలిన ఇల్లు

కాటారం, జూలై 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండ్రాత్పల్లి ఎస్సీ కాలనీలో గాలి దుమారంతో కూడిన వర్షం దాటికి బాడిసెగండు భానేష్-రేణుక దంపతుల ఇల్లు కుప్పకూలింది. పేద దళిత కుటుబానికి చెందిన వీరు కూలినాలి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కొన్నేళ్ల క్రితం నిర్మించుకున్న గూనపెంకుటిల్లు వర్షంతో నేలకూలిందని ఆవేదన వ్యక్తం చేసున్నారు.

చల్లగరిగ పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్

చిట్యాల, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చల్లగరిగ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. 60 మంది విద్యార్థులు పలు రకాల వంటకాలను తయారుచేసి ప్రదర్శించారు. ఈసందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన మండల విద్యాశాఖ అధికారి కోడెపాక రఘుపతి మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయ వంటకాలపై అవగాహన కల్పించడం మూలంగా విద్యార్థులకు బలవర్ధక ఆహారం పట్ల విలువలు పెరుగుతాయన్నారు. ప్రధానోపాధ్యాయురాలు ఎం.రూప్సీరాణి, గోవిందుల సత్యనారాయణ, శ్రీనివాస్, శనిగరపు భద్రయ్య, రహీం పాషా, సమ్మయ్య, శంకర్, వసంత, లక్ష్మీపతి, స్వరూపరాణి, జ్యోతిర్లత, శ్రీదేవి, రజిత, శ్రీపాల్ పాల్గొన్నారు.

(5వ పేజీ తరువాయి)

శిక్షణ తరగతుల నిర్వహణ జరుగుతోంది. మిగతా మూడు వైటీసీల్లో ఎలాంటి శిక్షణ తరగతుల నిర్వహణ లేకుండా పోయింది. ప్రస్తుతం హనుమకొండలోని స్టడీ సర్కిల్లో 76 మందికి మాత్రమే జరుగుతున్నాయి.

బడ్జెట్ లేమి.. ఐటీడీఏ అధికారుల నిర్లక్ష్యం

గిరిజన నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణనిచ్చి వారికి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసేలా వ్యవహరించవల్సిన ఐటీడీఏ అధికారులు తమకేమీ పట్టనట్లు ఉండడం గిరిజన యువతకు శాపంగా మారింది. బడ్జెట్ లేమి ఓ కారణం కాగా అధికారులు శ్రద్ధ పెట్టకపోవడం మరొక కారణమని నిరుద్యోగ యువత అంటున్నారు. గిరిజన మహిళా నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పనలో కట్టుమిషన్, జ్యూట్ బ్యాగు తయారీ, నాప్కిన్ తయారీ తదితర వాటిలో ఉచిత శిక్షణనిస్తే వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. కానీ ఆ దిశగా అధికారులు ఆలోచనలు చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. అంతేకాకుండా ఐటీడీఏ ద్వారా ఇచ్చే బ్యూటీషియన్ వంటి కోర్సులను ఐటీడీఏ గాలికొదిలేసింది.

జాబ్మేళాల నిర్వహణలోనూ అదే తంతు

ప్రైవేట్ రంగ సంస్థలతో ఐటీడీఏ సంప్రదింపులు జరిపి ఏజెన్సీ గ్రామాల్లోని ఉన్నత చదువులు చదివి ఖాళీగా ఉంటున్న యువతను గుర్తించి వారికి ఉద్యోగాల కల్పన కోసం జాబ్మేళాల నిర్వహణ జరగాలి. ఇది నిరంతర ప్రక్రియ. కానీ జాబ్మేళాల నిర్వహణ కూడా సక్రమంగా జరగడం లేదు. జనవరిలో మహబూబాబాద్లో మెగా జాబ్మేళాను నిర్వహించిన ఐటీడీఏ అధికారులు, ఆ తర్వాత దాని గురించే ఆలోచనలు చేయకపోవడం నిరుద్యోగ యువత ఆరోపిస్తున్నారు.

పట్టుతప్పిన శిక్షణ

అవస్థలు పడుతున్న నిరుద్యోగ యువత

గిరిజన నిరుద్యోగ యువత పట్ల ఐటీడీఏ వ్యవహరిస్తున్న తీరుపై పలువురు నిరుపేద నిరుద్యోగ యువత ఆందోళన చెందుతున్నారు. ఆర్థికంగా వెనుకబడిన యువతకు ఐటీడీఏ ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగాలు సాధించేందుకు ఉచిత శిక్షణనివ్వకుండా కాలయాపన చేస్తుండడంతో అవస్థలు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగ అవకాశాలు లేనిపక్షంలో స్వయం ఉపాధికి ఊతమిచ్చే కోర్సులను ప్రోత్సహించి వారికి ఆదేరువు చూపాలని పలువురు యువత తల్లిదండ్రులు కోరుతున్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగ యువత చెడు మార్గాలు, అలవాట్లకు దగ్గర అవుతారోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఐటీడీఏ చొరవ చూపి నిరుద్యోగ యువతకు ఓ దారి చూపాలని పలువురు కోరుకుంటున్నారు.

కేజీబీవీలో స్పాట్ అడ్మిషన్స్

కన్నాయిగూడెం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పనపల్లిలో ఉన్న కేజీబీవీలో ఈ నెల 21న స్పాట్ అడ్మిషన్స్ జరగనున్నాయని పాఠశాల స్పెషల్ ఆఫీసర్ జె.అశ్విని ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ ఎంపీసీలో 23, బైపీసీలో 20, ఆరో తరగతిలో 5, ఏడో తరగతిలో 2, ఎనిమిదో తరగతిలో 8, తొమ్మిదో తరగతిలో ఒకటి ఖాళీగా ఉన్నాయని తెలిపారు.

మంగపేటలో..

మంగపేట (ఆంధ్రజ్యోతి) : మంగపేటలోని కేజీబీవీలో స్పాట్ అడ్మిషన్లు జరుతున్నాయని కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ బాగ్య లక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ ఎంపీసీ- 30, బైపీసీలో 10 అడ్మిషన్లు బాలికలకు మాత్రమే అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఆరు, ఎనిమిది, తరగతుల్లో ఐదు చొప్పున ఖాళీలు ఉన్నాయని, ఐదో తరగతిలో 10 ఖాళీలు ఉన్నాయని వివరించారు.

కొర్కిశాలలో..

మొగుళ్లపల్లి (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొర్కిశాల కస్తూర్బాకళాశాలలో ఎంపీహెచ్డబ్ల్యూ, సీఈసీ కోర్సులలో స్పాట్ అడ్మిషన్లు జరుగుతున్నాయని ప్రిన్సిపాల్ బి.శైలజ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా కోర్సులలో 20సీట్లు ఖాళీగా ఉన్నాయని, అర్హులైన విద్యార్థినులు స్పాట్ అడ్మిషన్కు హాజరుకావాలని సూచించారు. పూర్తి వివరాలకు 7893669980 నంబర్ను సంప్రదించాలని పేర్కొన్నారు.

బైక్ను ఢీ కొన్న లారీ

- ఒకరికి తీవ్రగాయాలు

కాటారం, జూలై 19(ఆంధ్రజ్యోతి): బైక్ను లారీ ఢీకొని యువకుడు తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలోని కాటారం-మంథని ప్రధాన రహదారిపై వడ్లోని వాగు సమీపంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు, తెలిపిన వివరాల ప్రకారం.. శంకరంపల్లి గ్రామానికి చెందిన పోత రమేష్ ఓసీపీలో డంపర్ ఆపరేటర్గా పనిచేస్తున్నాడు. కుమారుడు మహదేవపూర్లో బంధువుల ఇంట్లో ఉండగా డ్యూటీకి వెళ్లొచ్చిన అతడు బైక్పై కుమారుడి దగ్గరకు బయల్దేరాడు. ఈ క్రమంలో వడ్లోని వాగు సమీపంలో బైక్ను నిజామాబాద్ జిల్లా డిచ్పల్లి నుంచి భద్రాచలం వెళ్తున్న లారీ వెనకనుంచి ఢీకొట్టింది. దీంతో ఎగిరి రోడ్డుపై పడగా వెనక టైర్ కాలుపై నుంచి వెళ్లడంతో నుజ్జునుజ్జు అయ్యింది. పోలీసులు 108 అంబులెన్స్లో భూపాలపల్లి 100పడకల ఆస్పత్రికి తరలించగా అక్కడి వైద్యులు ప్రాథమిక చికిత్స చేసి పరిస్థితి విషమంగా ఉండటంతో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి రిఫర్ చేశారు.

న్యాయం చేయాలని ఆందోళన

లారీ ఢీకొనడంతో తీవ్రగాయాల పాలై పరిస్థితి విషమంగా ఉన్న పోత రమేష్కు న్యాయం చేయాలంటూ పలువురు శంకరంపల్లి గ్రామస్థులు, రమేష్ బంధువులు ఆందోళన చేశారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో నిరసనకు దిగారు. సీఐ నాగార్జునరావు, ఎస్సై శ్రీనివాస్ అక్కడికి చేరుకొని ఆందోళనకారులతో మాట్లాడారు. క్షతగాత్రుడికి తప్పకుండా న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళనకారులు శాంతించారు.